
కథ



# అవసరార్థం

ప్రఫుల్ల చంద్ర

''ఆంటీ! ఆంటీ గారండీ!''

అరుపు విని సుభద్రమ్మ చేతులు చెంగుతో తుడుచుకొని కిచెన్ లోంచి బయటకొచ్చి వీధి గుమ్మంవైపు చూసింది.

చేతిలో సూట్‌కేసుతో ఎవరో అమ్మాయి. అందంగానే ఉంది. వయసు ఇరవై రెండుకి అటోయిటో. ఆమెను ఇంతకు ముందెన్నడూ చూసినట్టు లేదు.

''ఎవరూ?'' సమీపంగా వచ్చి అడిగింది సుభద్రమ్మ.

అమ్మాయి సూట్‌కేసు వదిలేసి చటుక్కున ఆమెకు మోకరిల్లి – ఆంటీ! ఆంటీ! మీరే నన్ను రక్షించాలి – అంటూ ఏడుస్తోంటే సుభ

ద్రమ్మ నిర్ఘాంతపోయింది. బెడ్‌రూంలో పేపర్ చదువుకుంటున్న శాంతారావు ఏడుపు విని ఆదరా బాదరా అక్కడికొచ్చాడు. చటుక్కున ఆ అమ్మాయి ఆంటీని ఒదిలేసి ఆయనకు మోకరిల్లి "అంకుల్! అంకుల్" అంది ఎక్కిళ్లు పడుతూ ఏమీ చెప్పలేకపోయింది.

ఆమెను ఓదార్చి, కుర్చీలో కూర్చోబెట్టి, టీ యిచ్చి అడగ్గా, అడగ్గా ఎక్కిళ్లు పడుతూ, ఏడుస్తూ, తడబడుతూ ఆమె చెప్పిన విషయం వారికి షాక్ యిచ్చింది.

ఆమె కల్పన. బెంగుళూరులో వారబ్బాయి సమీర్ పనిచేస్తున్న ఆఫీస్‌లోనే తనూ పనిచేస్తోంది. మొదటి చూపులో కాకపోయినా సంవత్సరం తర్వాత స్నేహం ప్రేమగా మారింది. అచంచల విశ్వాసంతో హద్దుమీరారు.

ఇప్పుడు కల్పన నెల తప్పింది. ఆమె తల్లిదండ్రులు పెళ్లిచూపులు ఏర్పాటు చేస్తున్నారు. సమీర్‌కి చెబుదామంటే అతడు నెలరోజులు ట్రయినింగ్ కోసం అమెరికా వెళ్ళాడు. ఫోన్‌లో దొరకడం లేదు. ట్రయినింగ్ పూర్తయింది. ఒకటి రెండు రోజుల్లో సమీర్ యిక్కడికి వచ్చాకనే బెంగుళూరు వెళ్తాడని ఊహించి, పెళ్లిచూపులు తప్పించుకోడానికి ఏం చేయాలో తోచక తల్లిదండ్రులకు చెప్పకుండా యిలా వచ్చేసింది.

"నన్నేం చెయ్యమంటారో చెప్పండి అంకుల్! చెప్పండి ఆంటీ!" అని రోదిస్తోందామె.

కల్పన చెప్పిందెంతవరకు నమ్మాలో అర్థంకాలేదు శాంతారావు దంపతులకు. సమీర్ యిష్టానికి వ్యతిరేకంగా ఆ యింట్లో ఏమీ జరగదు. వాడు ప్రేమిస్తే తప్పకుండా తమకి చెప్పేవాడే. అదీకాక అమెరికా వెళ్లేముందు పెళ్లి చూపులకు వచ్చాడు. అమ్మాయి నచ్చిందని చెప్పాడు. వాడు అమెరికా నుంచి రాగానే పెళ్లి చేయాలని ముహూర్తం నిర్ణయించుకున్నారు కూడా. ప్రేమిస్తే వాడెందుకా విషయం తమతో చెప్పలేదు?

అలాఅని కల్పనని అనుమానించడానికీ లేదు. ఆమె మాటల్లో, చేష్టల్లో నిజాయితీ కనిపిస్తోంది. సమీర్ పనిచేస్తున్న కంపెనీ పేరు, అతడు అమెరికా వెళ్లడం, ఒకటి రెండు రోజుల్లో రానుండడం, ఫోన్‌లో దొరక్కపోవడం – అన్నీ నిజమే.

"నన్నేం చేయమంటారు అంకుల్! సమీర్ వచ్చే వరకూ ఏదైనా హోటల్‌లో ఉండమంటారా?" దీనంగా అడిగింది కల్పన.

భార్యవైపు చూశాడు శాంతారావు.

"ఆడవాళ్లు హోటల్లో ఒంటరిగా ఉండడం మంచిదికాదు. సమీర్ వచ్చేవరకూ నువ్వు యిక్కడే ఉండొచ్చు" హఠాత్తుగా ఒక నిర్ణయానికొచ్చిన దానిలా అంది సుభద్రమ్మ. కల్పన ముఖం వెలిగిపోయింది. చివ్వున కన్నీళ్లు తిరిగాయి.

"మీరెంత మంచివారు ఆంటీ! నేనెంత అదృష్టవంతురాల్ని!" అంది, అప్పుడే తానా యింటి కోడలైపోయినంత సంబరంగా.

పేపర్‌తో బెడ్‌రూంకెళ్లి తలపట్టుకొని మంచం మీద కూర్చుండుపోయాడు శాంతారావు. పక్కగదిలో సూట్‌కేసు పెట్టి బాత్‌రూమ్‌లో ఫ్రెషప్ అయి కిచెన్‌లో సుభద్రమ్మ పక్కన చేరింది కల్పన.

అప్పుడు టైమ్ సాయంకాలం నాలుగు. టిఫిన్ టైమ్. ఏం చేయాలా అని సుభద్రమ్మ ఆలోచిస్తోంటే చొరవగా "నేను ఉల్లిపకోడీ బాగా చేస్తాను ఆంటీ! మీరిలా కూర్చోండి" అంటూ అలమరాలో డబ్బాలు తీసి చూసి చకచకా గిన్నెలో సెనగపిండి పోసి పువ్వు ఆకారంలో ఉల్లిపాయల్ని జాగ్రత్తగా కోసి పకోడీలు చేస్తోంటే పనిమంతురాలే అనుకుంది సుభద్రమ్మ.

కల్పన చేసిన పకోడీల్ని మెచ్చుకుంటూ తిన్నాడు శాంతారావు.

రాత్రి వంట కూడా కల్పనే చేసింది. కాసేపు కబుర్లు తర్వాత భోజనం అయాక ఒక బెడ్‌రూంలో వృద్ధ దంపతులు, రెండో దానిలో కల్పన నిద్రపోయారు.

***

ప్రతిరోజూ వేకువజాము నాలుగు గంటలకే నిద్రలేచే సుభద్రమ్మ ఆరోజు ఆరింటికి లేచింది. బద్ధకంగా ఒళ్లు విరుచుకొని చూసింది. భర్త ఆదమరిచి యింకా నిద్రపోతూనే ఉన్నాడు. ఇంత మొద్దునిద్ర పట్టేసిందేమిటా అని ఆశ్చర్యంగా బెడ్‌రూంలోంచి బయటకొచ్చి, లైట్‌వేసి, వీధి గుమ్మం తెరవడానికి వెళ్తోంటే పాదాలకు చల్లగా తాళం చెవి తగిలింది.




మీరు ఏ రంగంలో ఉన్నా... మీ బిడ్డల పెళ్ళిల్ల చింత మీకు వద్దు. అన్నలాంటి కాకతీయ మీ చెంతనే ఉంది.

**కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్**

103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.

ఫోన్ : 040-2374 7777, 09396 999 999



శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి


www.kaakateeya.com

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION

www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టీ. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |




కిటికీలోంచి పాలవాడు అరుస్తున్నాడు ''అమ్మగారూ! మీరు ఇంట్లోనే ఉన్నారా! బయట తాళం వేసి ఉందేమిటమ్మా!''

షాక్ అయిన సుభద్రమ్మ ''అయ్యగారు వాకింగ్‌కి వెళ్తూ తాళంవేశారులే'' సందర్భోచితంగా అబద్ధం చెప్పి కిటికీలోంచి అతనికి తాళంచెవి ఇచ్చింది.

వాడు తాళం తెరిచి, పాలు యిచ్చి వెళ్లాక పరుగున రెండో బెడ్‌రూంలోకి వెళ్లింది సుభద్రమ్మ... కల్పన మాయం! బీరువాలోని లాకర్ తెరచి వుంది. నగలు.. ఉన్నాయి! కానీ, అన్నీ ఉన్నాయా? ఒక్కొక్కటీ బయటకు తీసి చూసింది.

ఒక చంద్రహారం మాయం!

మెరుగు పెట్టించి పెళ్లిలో కోడలికి పెట్టాలని నిన్ననే బ్యాంక్ లాకర్ నుంచి తెచ్చిన నగలవి. గాభరాగా భర్తని లేపి అక్కడకు తీసుకొచ్చింది.

రాత్రిళ్లు సాధారణంగా రెండుమూడుసార్లు లేచి బాత్‌రూం కెళ్లే అలవాటున్న శాంతారావు ఆ రాత్రి ఒక్కసారీ లేవలేదు. తమకి మత్తుమందిచ్చి చంద్రహారంతో ఉడాయించి ఉంటుంది కల్పన. ఎంత మోసం!

అయితే నలభై లక్షల విలువ చేసే నగలు వదిలేసి మూడు లక్షల విలువచేసే ఒక్క చంద్రహారమే ఎందుకు దొంగిలించినట్టు! మింగుడుపడని ప్రశ్న.

ఆశ్చర్యం... ఆనందం... సంభ్రమం... తర్వాత కల్పన ప్రస్తావన.

తమ ఆఫీసులో కల్పన పేరుతో ఎవరూ లేరనీ, తనెవరినీ ప్రేమించలేదని చెప్పి ''మూడు లక్షల నగ పోయిందని విచారించక, నలభై లక్షల నగలు లక్షణంగా ఉన్నందుకు సంతోషించండి. ఈ విషయం అందరికీ చెప్పి మనసు పాడుచేసుకోకండి. పోలీసులకూ రిపోర్టు చేయకండి'' అని ఓదార్చాడు. అయినా - చాలాకాలం వారి హృదయాల్ని ఆ విషయం గుచ్చుతూనే ఉంది.

***

సమీర్‌కి పెళ్లయింది. కొడుకు పుట్టాడు.

రెండేళ్లు గడిచాయి - పిల్లవాడి బర్త్‌డే సందర్భంగా అందరూ ఆనందంగా వున్నప్పుడు శాంతారావుకి కొరియర్ ద్వారా ఒక పార్శిల్ వచ్చింది. అందులో మూడేళ్ళ క్రితం మాయమైన చంద్రహారం, ఒక చిన్న ఉంగరం, ఒక ఉత్తరం -

ఆ ఉత్తరంలో...

''నేను కల్పన! నన్ను మీరు తిట్టుకుని ఉంటారు. కానీ అవసరార్థం నేనలా చేయక తప్పలేదు.

మా నాన్న రిటైర్ అయాక మా అమ్మ నగల మీద ఐదు లక్షల లోన్ తెచ్చి అన్నయ్యకు ఉద్యోగం కొన్నారు నాన్న. మూడు లక్షలు లోన్ తీర్చాక అన్నయ్య పెళ్లాం కొంగు పట్టుకొని వేరింటి కాపురం వెళ్లిపోయాడు. అమ్మానాన్నల బాధ్యత నా మీద పడింది. ఐదు లక్షలిస్తే మంచి ఉద్యోగం ఇప్పిస్తానని ఒక బ్రోకర్ చెప్పాడు. మిగిలిన లోన్ రెండు లక్షలు తీర్చితే గాని అమ్మ నగలు విడుదల కావు. అవి విడుదలయితే మళ్లీ వాటిమీద లోన్ తెచ్చి నేను ఉద్యోగం సంపాదించవచ్చు. ఇదంతా వారం రోజుల్లో జరగాలి. ఆ రెండు లక్షలకోసం నేనెందర్ని యాచించానో, ఎన్ని అవమానాలూ, ఛీత్కారాలూ పొందానో నాకే తెలుసు. హామీ లేకుండా ఎవరూ అంత డబ్బు యివ్వరని నిర్ధారణ అయాక -

బాగా ఆలోచించి, ప్లాన్ చేసి, వివరాలు సేకరించి నేను మీ యింటచేరి చంద్రహారం కాజేశాను. నమ్మించి మోసం చేయడం, అన్నంపెట్టిన యింటికే కన్నం వేయడం ఎంత బాధిస్తుందో ఆ క్షోభ అనుభవించాను.

తలుపులు తెరిచి వెళ్లిపోతే మరెవరైనా యింట్లో దూరి నగలు కాజేసి మొత్తం నేరం నామీదకు మళ్లించవచ్చు. అందుకని బయట తాళంవేసి, తాళంచెవి లోనికి విసిరేశాను.

మీ చంద్రహారం మీద లోన్ తెచ్చి మా అమ్మ నగలు విడిపించి మళ్లీ వాటిమీద లోన్ తెచ్చి ఉద్యోగం సంపాదించుకున్నాను. కడుపు కట్టుకొని పైసాపైసా కూడబెట్టి ఈనాటికి మీ చంద్రహారం విడిపించి మీకు పంపుతున్నాను. ఇంతవరకూ ఒక అపరాధ భావన నన్ను దహించివేస్తూనే ఉంది. నిద్రలేని రాత్రులు ఎన్నో!

అయితే ఈ రాత్రి నేను హాయిగా నిద్రపోగలనని అనుకుంటున్నా.

కల్పన నా నిజం పేరు కాదని మీకు తెలుసు. నా పేరు, అడ్రసూ మీకు చెప్పను. భవిష్యత్తులో యాదృచ్ఛికంగా మనం కలుసుకుంటే మీ ఎదుట నేను తల ఎత్తుకోగలనో లేదో నాకైతే తెలియదు. మనం కలిసే పరిస్థితి ఎదురవకూడదని దేవుడిని ప్రార్థించుకుంటున్నా.

సమీర్ పెళ్లి జరిగి ఉంటుంది. మీకు మనవడో, మనవరాలో పుట్టి ఉండొచ్చు. నేను చేసిన తప్పుకు అపరాధ రుసుముగా ఈ చిన్న ఉంగరం పంపుతున్నా - మీ మనవడు / మనవరాలికి అజ్ఞాత ఆంటీ కానుకగా.

క్షమించగలిగితే నన్ను క్షమించండి''.

★